# అపోహ

శ్రీ ఒగ్గు సత్యనారాయణమూర్తి

"వేణీ! వేణీ! తలుపుతియ్యి" అని నెమ్మదిగా పిలిచాడు రఘు. తొందరగా సమాధానం రాక పోయేసరికి, కాస్త గట్టిగా తలుపు కొట్టాడు.

"ఆఁ! వస్తున్నా" అనేమాటలు నెమ్మదిగా నూతిలో పలినుండి మాట్లాడు తున్నట్లు వినిపించినవి."

"వేణీ!" అని యీసారి కాస్త బిగ్గరగానే పిలిచాడు.

"ఆఁ! వొకపక్క వస్తూంటేనే యేమిటా కేకలు?" అని కోపంగా తలుపు తీసింది.

తలుపులు తెరుచుకోగానే రఘు, వొకచిరునవ్వు విసురుతూ అలివేణి ముఖంలోకి తొంగి చూచాడు. అతడు నిర్విణ్ణుడయ్యాడు. ఎంత విసుగూ కోపమూ కలిగినా అలివేణి ముఖం కనబడేసరికి, పెనుగాలివీస్తే మేఘచ్ఛయం చెల్లా చెదరయినట్లు, అతని ముఖంలో కోపం యెక్కడా కనుపించేదికాదు. వెంటనే వొకచిరునవ్వు విసిరేవాడు. దానిని అందుకుంటూ ఆమె కూడా చిన్నగా, వినీవినిపించనట్లు నవ్వేది. కాని ఆరోజు ఆమె ముఖాన్ని చూచేసరికి చిరునవ్వుకు, బదులు, చిట్లింపు. అసహ్యం, ఏవగింపుతో కూడిన విసుగు కనిపించేసరికి వొక్కసారిగా నిర్విణ్ణుడయ్యాడు. కుడిచేతిలోని పత్రిక క్రింద పడింది. ఎడమ చేతిలోనిమల్లెపూలపొట్లంజారినంతపనయింది. క్రిందపడిన పత్రికను పైకి, చేతిలోనికి తీసుకొని, నెమ్మదిగా అడుగులు వేస్తూలోనికి వెళ్ళాడు. అలివేణి రఘు ముఖంలోకి వొక్కసారి విసురుగాచూచి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రఘుకు వివాహం అయి యెంతోకాలం కాలేదు. అలివేణి అంటే అతనికి అమితమైనప్రేమ. అతడు అలివేణిని ప్రేమ పెండ్లి చేసికొనక పోయినా, వరకట్నం తీసికోలేదు. ప్రేమ పెండ్లి అయినప్పటికీ, కట్నం పరిగ్రహించిన వరులెందరులేరు! అందుకే రఘుని అతనిస్నేహితులు "ఆదర్శ యువకుడివిరా! వరకట్నం నిరాకరించావు." అని అంటూంటే, పైకి కనబరచక పోయినా లోలోపల గర్వపడే వాడు.

పెండ్లి చూపులకు వెళ్ళినపుడు, అలివేణి యేమంత ముస్తాబు కాలేదు అందరిలాగ కాకపోయినప్పటికీ, ఆమె లోని సహజ సౌందర్యపు సొగసును చూచాడు రఘు. అలివేణి తలిదండ్రులు యేమంతఆస్థిపరులు కాకపోయినా సజ్జనులు, గౌరవప్రపత్తులు కలవారు. ధనాభావముచేత పెద్ద కట్నాలు కూడ యిచ్చుకోలేనివారు. అయినప్పటికీ, రఘు ఆ వివాహానికి సమ్మతించాడు. కట్నం అక్కర లేదన్నాడు.

రఘు తలిదండ్రులు కొద్దిగా ఆస్థిపరులనే చెప్పాలి. సహజంగా కట్నం అంటే అందరిలాగ ఆశ వున్నా, కొడుకు మాటకు యెదురు చెప్పలేక పోయారు. "సరే! నీ యిష్టం నాయనా! పిల్లనీకు నచ్చితేచాలు అదే పదివేలు. కట్నంలేకపోయినా ఫరవాలేదు." అన్నారు సహజ ధోరణిలో ఉదాత్తంగా. రఘుకు అలివేణితో వివాహం అయిపోయింది.

రఘు బి. ఏ ప్యాసయిన తరువాత గుమాస్తాగా ప్రవేశించాడు. పెండ్లి అయిన కొద్దిరోజులకే ట్రాన్స్ఫరు రావటంచేత అలివేణితోసహా కొత్తవూరులో కాపరంపెట్టాల్సి వచ్చింది.

పెండ్లి అయిన తరువాత వారిద్దరూ చాలా అన్యోన్యంగానే వుంటూ వచ్చారు. కాని రఘు వారంరోజుల నుండి అలివేణిముఖంలో ఆహ్లాదపురేఖలు చూడలేకపోయాడు. ఆవారం రోజుల్లోను ఆమెలో కాస్త నిర్లక్ష్యం, యేహ్యభావం, కోపం, దుఃఖం, చూచాయగాకన్పిస్తుండటంచేత, రఘు అప్పుడప్పుడు, "వేణీ! ఏమిటలా వున్నావు? అని ప్రశ్నించేవాడు ఆప్యాయంగా. "ఆఁ! ఎట్లా వున్నానేమిటి?" అని మాత్రం అనేదేకాని, అసలు కారణం చెప్పేదికాదు. రఘు ఆమె మనస్సును సరిగా అర్థం చేసుకోలేక పోతున్నానని బాధపడేవాడు.

కాని ఆరోజు, అలివేణి కెంతోయిష్టమైన మల్లెపూలను ఆఫీసునుంచివస్తూ తీసుకొచ్చాడు రఘుయెంతో ప్రేమతో.

రోజూ తను ఆఫీసునుంచి రాగానే చిరునవ్వుతో తలుపు తీసి, ఆహ్వానించి, పరామర్శించే తన అలివేణి, ఆ రోజు యెందుకలా ప్రవర్తించిందో అర్థంకాలేదు రఘుకు. "కారణమేమిటా?" అని గత ప్రవృత్తిని అవలోకన చేసికొనడం ప్రారంభించాడు. కాని, అలివేణి యెడల తానేమీ అసభ్యంగాను, అసహ్యంగాను ప్రవర్తించలేదు. ఆమె నొచ్చుకునేటంత మాటేమీ అనలేదు. మరెందు కామె అలా వున్నదో అర్థంకాక పోయేసరికి బాధ కలిగిందతనికి. గత్యంతరంలేక కోపకారణం ఆమెనే అడిగితెలుసుకోవా లనుకొన్నాడు రఘు.

"వేణీ! కాస్త మంచినీళ్ళు తీసుకురా" అని పిలిచాడు.

ఆమెలోపల కూజాలోని మంచినీళ్ళు కాసిని గాజు గ్లాసుత్తో తీసుకొచ్చింది.

ఆమె చేతిలోని గ్లాసును అందుకుంటూ, "వేణీ ఎందుకలా వుంటున్నావు? నాతో చెప్పవూ. నామీద నీ కేమైనా కోపమా? నేనేమన్నాను? లేకపోతే నీ యెడల యేమైనా తప్పుచేశానా? చెప్పువేణీ! నీవుకోరిన జార్జెటుసిల్కు చీర తేలేదనా? నామీద అలుకెందుకు? రేపు జీతంరాగానే తప్పకుండా తీసుకొస్తాగా! నీవు దేని కోసమో అలిగావు. లేకపోతే నేనంటే యెప్పుడూలేని ఏహ్యాభావ మెందుకు? ఎందుకలా విసుగు జెందుతావు? నీ అవ్యక్తమైన బాధను వ్యక్తంచేస్తూ నన్నెందుకు బాధ పెట్టావు? నీ అలుకకు కారణ మేమిటో చెప్పరాదూ! ఎందుకు మరుగు పరుస్తావు? ఎన్నాళ్ళు యీ తెలియని బాధ ననుభవించమంటావు? నీవు చెప్పకపోతే నామీద ఒట్టు వేణీ! చెప్పు వేణీ!" అని అర్థించాడు రఘు బ్రతిమాలుతున్నకంఠంతో.

ఆమె నయనాల్లో అశ్రువులు గిఱ్ఱున తిరిగినవి. అవి ఒక్కొక్కటే నేలమీదకు ఆణిముత్యాల్లా కనుకొలకుల నుండి జారి పడినవి. ఆమె కంఠంలో దుఃఖం అడ్డుపడి మాటపైకి రాలేదు. రఘువైపు వెఱ్ఱిగా చూస్తూనిల్చుండి పోయింది.

"ఎందుకలా దుఃఖిస్తావు? చెప్పు వేణీ! భయమెందుకు? నీవలా జలజలా కన్నీరు రాలుస్తుంటే నా హృదయం పరితపిస్తోంది వేణీ!" అన్నాడు.

"ఆరోజు రాత్రి మీరు వ్రాస్తున్న ఉత్తరం ఎవరికి?" అని మాత్రం అస్పష్టంగా అనగలిగింది అలివేణి.

"ఎప్పుడు వ్రాశాను? ఎవరికీ వ్రాయలేదే! ఆరోజంటే యెప్పుడు?" అని ప్రశ్నించాడు జ్ఞాపకం చేసుకుంటూ.

"ఎందుకలా తెలియనట్లు అడుగుతారు? గతశనివారం రాత్రి మీరు నిద్రపోకుండా ఏదో వ్రాశారుకదా! అప్పుడు నేను మీదగ్గరకు వచ్చా, నిద్ర మెలకువ వచ్చి మీరింకా మేలుకొని వుండటం చూచి. బహుశా నారాక మీరు గుర్తించి వుండరు వ్రాతలో నిమగ్నులై వుండటంచేత నేనప్పుడు మీ వెనకాల నిల్చుండి చూచా. మీ రెవరికో ప్రేమలేఖ వ్రాస్తున్నట్టు తోచింది. "ఎవరా!" అని చదివాను. అంతా అర్థమయింది, నాకు తెలియకుండా మీరు సాగిస్తున్న ప్రేమకలాపాలు ఇకచాలనుకుంటా. వివాహం చేసికొనికూడా యెందుకిలా ప్రవర్తిస్తారు? ఆ కమలనే.."

అలివేణి కంఠం వణికింది. కన్నీరు సంతత ధారగా ప్రవహించ మొదలిడింది. ఆమె దిగజారిన బింకాన్నికూడ దీసుకుంటూ, "కాదంటారా?" అనిమాత్రం అనగలిగింది.

అప్పుడు రఘూకు ఆమె కోపకారణం స్ఫురించింది. అతని ముఖంలో చిరునవ్వు మొలకలెత్తింది. ఫక్కున నవ్వేశాడు.

ఆమెకు మరింత కోపం రేగింది.

రఘూ పెద్ద నవ్వు నవ్వుతూ లోపలికి వెళ్ళి ఒక పత్రిక తీసుకువచ్చి ఆమెకు ఇచ్చాడు.

అలివేణి సిగ్గుతో తలవాల్చేసింది ఆమెలో చైతన్యం కలిగింది. గబాలున లేచివచ్చి భర్తను కౌగలించు కుంది. రుద్ధకంఠంతోనే "క్షమించండి! అపోహపడ్డా" అని అతని ముఖంలో చూచింది పశ్చాత్తాపపడుతూ.

"ఆ బల్లమీద నీ కిష్టమైన మల్లెలున్నాయి చూడు" అన్నాడు రఘు.

సంతోషంతో అలివేణి ముఖం వికసించింది. మల్లెలు గుబాళించాయి.

ఇంతకీ ఆతను వ్రాసిన ప్రణయలేఖ ఒక పత్రికకి.

---